ఒక స్త్రీకి
నిస్వార్థంగా
నీడనిచ్చే
గొప్ప మనసు
మగాడికి వుందా?

# కీకారణ్యం

డా॥ శివకోటి
కథ

"అమ్మ ఇంకా రాలేదేం తాతా!'' అడిగింది ప్రైవేటు బడినుంచి పరుగున గుడిసెలోకి జొరబడుతూ.

ఈ తాత చిట్టికి తాతకాడు.


అక్కడున్న అరవై గుడిసెలకూ ఆయన తాతే.

ఈయన వయస్సు తొంభైపైనే వుండొచ్చు. నూరులో పడి వుండొచ్చు. లెక్క తెలీదు. కాకపోతే సుభాష్ చంద్రబోసు విమాన ప్రమాదంలో చనిపోయాడనీ, లేదు బ్రతికే వున్నడనీ, దేశం అంతా అనుకునే రోజుల్లో తాతతో ఉన్నావిడ పస్తులుండలేక పదేళ్ల కాపురాన్ని వదిలి చెప్పా చెయ్యకుండా ఎటో వెళ్లిపోయింది. ఎట్టా వచ్చిందో అట్టాగే. 'తాత' ఆవిడకోసం వెతకనూ లేదు. ఆవిడ తిరిగి రానూ లేదు. కాకపోతే పిచ్చిముండ ఎన్ని కట్టాలు పడతదో? అనుకున్నాడు.

ఆ తరువాత మరో ఆవిడ తాత బ్రతుకులోకొచ్చింది.

ఈవిడ తాత దగ్గరకు రాకముందు ఓ కుంటోడితో ఉంటుండేదట. వాణ్ణి ఒకనాడు ఓ కారు గుద్దేసి ఆగకుండా వెళ్లిపోయిందట. అర్ధరాత్రి దాటాక జనంలేని కారణాన తుర్రున ఉడాయించిన ఆ కారు ఆనవాలు దొరకలేదు. కుంటోడికి కళ్లున్నాయిగదా! వాడయినా చెపుతాడేమోననుకుంటే వాడు పోలీసోళ్ళు రాకముందే నెత్తురు కక్కుకుని హరీ మన్నాడుట. ఆ పొద్దుట నలుగురూ పోగయ్యారు.

నాలుగు రకాలుగా అనుకున్నారు. కొందరు దూరంనుంచే చూసిపోయారు. ఈడే, రోడ్డుకడ్డంగా పోయుంటాడేమో నన్నారు కొందరు. కాదన్నారు కొద్దిమంది. కారు తగిలిన తీరు జూస్తే వీడిదే పొరపాటుందేమోననిపిస్తుదని చప్పరించారు మరికొందరు.



దాని ఏడుపు చూసి చందాలు పోగేసి, వాళ్లెట్టాగో, ఊరవతలకు తోలారు. అంతటితో తమ పని అయిపోయినట్టుగా చేతులు దులుపుకుని ఎవని తోవన వాడు ఎల్లిపోయారు. కారు పెద్దోళ్లదట్టుంది. పోలీసులు కిమ్మనలేదు. దీంతో ఆవిడ మరీ దిక్కులేనిదయింది. గుడిసె చేరదామంటే గుబులు. బయట భయం. ఈ దిక్కుమాలిన తనానికి తోడు ఆడదాని వంటికి

వయస్సుంటే ఎంత కష్టమో ఆ తరువాత తెల్సింది.

రాత్రయ్యాక పరావర్శించడానికొచ్చి భుజంపైన చెయ్యేసి వెళ్తా వున్నారు. పట్టపగలే వచ్చి ఇక ఈడ ఏముంది నాతాన వుందువుగాని రా! ఆడూ నీకు తాళిగట్టినోడేం గాదుకదా! అన్నోళ్లూ వున్నారు. ఆబగా చూస్తూ ఒంటరిగా ఎట్టుంటావు? అన్నాళ్లూ వున్నారు. వాళ్లనుంచి ఎట్టానో నెట్టుకుని వచ్చింది పాపం! కానీ. ఒకరోజు అపరాత్రి ఇద్దరు రిక్షావాళ్లు అర్ధాంతరంగా గుడిసెలోనికొచ్చి నోట్లోగుడ్డలు కుక్కి తమ పని కానిచ్చుకుని ఎళ్లిపోయారు. ఏడ్చినా మొత్తుకున్నా, నోట మాట పెగలిచావలా. జారిన కన్నీరు మాత్రం చింకిచాపను కొంతమేర తడిపింది. ప్రాణం అన్నుపట్టింది. తల దిమ్మెక్కింది. మెల్లగా లేచి నోట ఉన్న గుడ్డముక్కల్ని పీక్కుని. ఒంటిమీద బట్టను సరిచేసుకుని ఆ చీకటిలోనే ఆసరాగా వుంటాడు అనుకుని తాతదగ్గరికొచ్చి మొక్కేసి 'ఇక నీ తాన వుంటా' అన్నది!

'అట్టనే వుండు' అన్నాడు తాత. దాని బాధను చూసి జాలిపడి!

అది మొదలు అడుక్కునేందుకు దాపులో ఓ సెంటరు చూపాడు తాత.

తన అడ్డాకు తను వెళ్లిపోయాడు.

రాత్రవగానే ఎవరితోవన వారు గుడిసెకు చేరేవారు. ఇట్టి నాల్గు నెలలు గడచిపోయినయ్. కడుపు మాడకుండ చిల్లరపైసలు దొరుకుతూనే వున్నాయి. ఒక పొద్దున 'అమ్మీ! మనం ఆలు మగలమవుదామా?' అనడిగిండు తాత.

తలూపిందావిడ. అట్ల ఎందుకు అడిగిండు? అని అనుకోలేదు.

ఆ రాత్రి గుడిసెలో ఒక చాపమీదకు చేరినాక కాపురం మొదలెట్టబోయే ముందు తాత గుండెపైకి ఒరిగి 'ఇగో నాకిప్పుడు నాలుగోనెల అని కొత్త పెళ్లికూతురిలా గారాలు పోతూ చెప్పింది! ఉలిక్కిపడలేదు తాత. నిబ్బరంగా చూసి ''అరె! ఇంకా పక్కలోకే సరిగా రాలేదు. నాలోగో నెలేందే ఎర్రిమొఖమా' అన్నాడు తాత - తడికల బయటకు ఇనపడకుండా తొర్లి తొర్లి నవ్వుతూ!

'అదే! ఆ కుంటోడు పోయినంక ఓ అపరాత్రి ఇద్దరొచ్చి నోట్లో గుడ్డలు కుక్కి బలవంతంగా ఆగం జేసిన్రుకదా! ఒకవేళ ఇది వాళ్ల పాపమేనేమో? ఇదీ నెలకిందనే తెల్సినాది. గుండెలు పగిలేలా ఏడ్చినాను. ఇంకా ఇంకా ఎంతాగానో ఏడవాలనిపించింది. కానీ పొద్దస్తమానం ఏడుస్తూ కూకుని అడుక్కోవడానికి పోవడం మానేస్తే ఈ బాధకు తోడు పస్తులుండాల్సి వస్తదని అర్ధమయింది. అంతే ఏడుపునాపుకుని ముఖం తుడుచుకుని అడుక్కునే సెంటరుకు పరుగున వచ్చినా. ఆనక అదేందోగానీ అంతగా ఏడుపు రాలేదు! కాకపోతే మనసంతా ఎట్లనో అయ్యేది' అంది.

మెలికలు తిరిగిపోతూ నవ్వాడు తాత!

తాత ఎందుకంత ఇదిగా నవ్వుతున్నాడో అర్థంకాలేదావిడకు!

నవ్వి నవ్వి ఆగి దగ్గరకు తీసుకుని ''ఇగో కలిసొచ్చే కాలానికి నడచివచ్చే కొడుకు పుడతాడని అంటారు! మనకే రకంగా కలిసొస్తదో చూద్దాం!'' అని నేను నిజంగా చానా అదృష్టవంతుణ్ణి. నువ్వు నాల్గు నెల్ల పోరణ్ణి మోస్తుండడం మామూలా ఏంది? అన్నాడు ఎగిరిపడుతున్న నవ్వును ఆపుకుంటూ!

ఆవిడా నవ్వింది. గువ్వలా తాత ఒడిలోకి ఒదిగిపోతూ.

కాలం గడిచింది.

మగబిడ్డ కలిగాడు. రంగు బాగానే వుంది.

ఆడి తండ్రెవడని తాత ఎన్నడూ పెదవి విప్పి అడలేదు.

తన కొడుకు కాదన్నట్టుగా ఎన్నడూ చూడలేదు.

తన బిడ్డే అని మనసు పెట్టి సాకాడు. భుజాన మోశాడు. బువ్వ తినిపిచ్చాడు. సంభాళించాడు. చదువుతానంటే బడికీ తోలాడు. కానీ - వాడికి చదువు అబ్బలేదు.

ముడ్డిమీదికి మాత్రం పన్నెండేళ్లు వచ్చినయ్.

పోరడికి చదువు రాకపాయెననే బాధ దానికుంది. అది మొదలు దానికి ఒంట్లో నలత మొదలయింది.

పోరణ్ణి ఎక్కడ పనికి వుంచినా మూణ్ణాళ్ల ముచ్చటే అయింది. రూపాయి బిళ్ల ఆడు - ఇంటికి తెచ్చుడుపోయి ఇక్కడే పందికొక్కులాగయిండు.

'తాత' ఒక్కడి సంపాదన. దాని మందులకూ తినేందుకు సరిపోలేదు. అంచేత అది జబ్బును పట్టించుకొనక దొరికింది తింటూ కాలంగడిపింది.

జబ్బు బాగా ముదిరింది.

దానిపని అది చేసుకుని పోతుందిగదా! ధర్మాసుపత్రికెళ్లిందొకనాడు.

డాక్టరు పరీక్షలు చేసి చూసి మూడు వేలుంటే ఆపరేషన్ చేద్దాం! బ్రతుకుతావు. లేకపోతే మూడు నాలుగు నెలలు దాటడం కష్టం అని చెప్పాడు. ఈ మాట చాటునుంచి విన్న పోరడు గుండెలవిసిపోయేలా ఏడ్చాడు. ఇక ఈవిడేమో? తాతకు బరువు కావడం పూర్తిగా ధర్మం కాదని చెప్పకుండా ఎటో వెళ్లిపోయింది. ఈ పోరడేమో, తల్లినెట్లాగైనా బాగుచేయించుకోవాలని, అందుకు డబ్బు అవసరమని లారీకిందపడి చెయ్యి, కాలు పోగొట్టుకున్నాడు. జనం పోగయి వాణ్ని ఆసుపత్రికి చేర్చారు. ఆడికెళ్లడు తాత. పోరడి పక్కలో కూర్చుని -

''ఏందిరా ఇదీ!'' అది కళ్లెంట నీరెట్టుకున్నాడు. తల నిమిరాడు. వాడు తాతవైపు తిరిగి ''అయ్యా గుబులు పడక నా మాట విను'' అన్నాడు.

''అట్టగేలేరా!'' అన్నట్టు చూశాడు తాత!

''మనకు డబ్బొత్తదే! దాంతో అమ్మ వల్లు బాగుచేయించు'' అన్నాడు.

''డబ్బా? ఏడిదిరా? నాకు తెలకుండా నువ్వు ఏడ సంపాదిస్తివిరా! అసలు ఎట్టా వస్తదని అనుకుంటుండవు?'' అనడిగాడు కళ్లు తుడుచుకుంటూ.

## ఉదాహరణ

''ఈరోజు క్లాసులో వ్యాకరణం చెప్పారా, అయితే ప్రశ్నార్థక వాక్యానికి ఓ ఉదాహరణ చెప్పు?'' అడిగాడు అప్పారావు.

''మీరు పిచ్చివారా?!'' చెప్పాడు బాలుడు.

- సిరిసిల్లా రశీద్ శిక్షక్ (దోన్కల్)



''వత్తదని చెప్పినగదా! తప్పక వస్తదే'' అన్నాడు.

''ఏదిరా? ఎట్ల??''

''అదేనే. లారీ కిందగానీ, కారుకిందగానీ పడితే కాలో చెయ్యో పోతదిగదా అప్పుడు ఇన్సూరెన్సోళ్లు మనతానకొచ్చి బోలెడు డబ్బు లిస్తరటనే. ఖుద్దుగా వకీలు గుమస్త ఈ మద్దెన చెప్పిండు'' అన్నాడు.

''ఇదేందిరయ్యా. అసలీ తిరకాసేందో నాకు బొత్తిగా సమజయిత లేదు'' అంటూ కళ్లు వత్తుకున్నాడు.

''అదేం లేదే! నువ్వు అనవసరంగా ఫికరు పడకు. వకీలు గుమాస్తాగాడు ఇట్లాంటి కేసులకోసం తెగతిరుగుతుంటే నేను లారీకింద పడి కేసిచ్చిన. లారీ నెంబరుగట్ల మొత్తం రాసకపోయిండు'' అన్నాడు ఉత్సాహంగా. నోట మాటరాక ఆగిపోయిండు తాత.

మన వాటాకే ఏభైవేలు ఇప్పిస్తానన్నడే. అమ్మకు పూరాగా నయమవుతదిగదా. పైకం మిగిలితే అంతా సుఖంగా బతకొచ్చుగద!'' అన్నాడు. ఆ పరమశివుడు ప్రత్యక్షమై ఆయాచితంగా వరాలిచ్చిపోయినంత సంతోషంగా.

'తాత'కు ఇది అర్థమయినంక ఏడవాలో నవ్వాలో తెలియలేదు. గుండె ఆగిపోతదేమోననిపించింది. నీళ్లోసుకున్నట్టు మొల బట్టకూడా ముద్దయినది. కానీ -

డబ్బుకోసం - వకీలు గుమాస్తాగాడి మాట నమ్మకం పట్టి-

వీడంతట వీడే లారీక్రింద పడ్డాడనేది మనస్సుకు పూర్తిగా అర్థమయ్యాక -

తాతకు దుఃఖం ఆపుకుందామన్నా ఆగలేదు. తల బాదుకున్నాడు. జరిగిన ఖర్మకు వాడి ప్రేమకు ఎట్లా దండమెట్టాలో అంతుపట్టలేదు. వారం తిరుగలేదు. ఆసుపత్రిలో వైద్యం జరుగుతనే వుండది మధ్యాహ్నంలా! ఓ పొద్దుట - ధనుర్వాతం వచ్చిందన్నాడు డాక్టరు. కాలు విరిగిన కాడనుంచి చెడుతూ పైకొచ్చిందట! ఇక మా చేతుల్లో లేదు అన్నాడు. ఆ రాత్రంతా అంతుమాలిన జ్వరం! చెయ్యి పెడితే పేలిపోతున్నది.

బిడ్డడు మూసిన కన్ను తెరవనూ లేదు. కాకపోతే

అంతబాధలోనూ 'అమ్మ' 'అమ్మ' నీకు బాగయితదే అని పలవరిస్తూనే వున్నాడు. అప్పుడప్పుడు వకీలు గుమస్తాను యాది చేసిండు.

కళ్లు తెరిచినపుడల్లా తాత చేతిని పట్టుకుని అయ్యా, అమ్మకి నువ్వు దగ్గరుండి నయం చేయించు. డబ్బుకి ఫికరుపడకు. నిండా ఏభై వేలు వస్తయ్ అనేటోడు.

అట్ల పలవరిస్తూనే పోరడు చచ్చిపోయిండు.

వాడు చచ్చిపోనాడని చెపుదామన్నా అది ఏడ వుందో దొరకలేదు. చివరకు పోలీసు ఠానాలోకూడా చెప్పినాడు. పోరడి అమ్మ సంగతి. 'అమ్మ'కి వైద్యం చేయించేందుకు వీడు లారీక్రింద పడి చనిపోయాడుగానీ, వీడ్ని ఆసుపత్రినుంచి బయటకు తీసి బొంద పెట్టేటందుకు తాత సంపాదన ఆరతి కర్పూరమైపోనాది! ఆనక అసలా వకీలెవడో, వకీలు గుమస్తా ఎవడో మాత్రం బొత్తిగా అర్థంకాలేదు. ఆ డబ్బుకు కోర్టులో ఎవడ్ని నిలబెట్టి కాజేశారో అంతుబట్టలేదు. కానీ పోరడినీ తల్లినీ తలచుకుంటే తాతకు కళ్లెంట నీరు ఇగిరిపోయేది. ఆ అమ్మా బిడ్డలకు ఒకరిమీద ఒకరికున్న ప్రేమ గుర్తుకొస్తే చాలు గుండె చెరువయ్యేది. ఆ పొద్దు నిదరా రాకపోయేది! అరె! ఇదేం ప్రేమ? ఒకళ్లకోసం ఒకళ్లు... అమ్మో అట్లనా? తలనరాలు చిట్లుతయని భయమేసేది.

''చెప్పు తాతా! అమ్మేది!'' అంది చిట్టి తాతను కుదుపుతూ. అప్పటిదాకా మనసుని కమ్మిన పొర చెదరిపోయి, చిట్టివైపు ఆప్యాయతగా చూసి 'వస్తది'

నువ్వొచ్చేసరికే అసలు వచ్చేయ్యాల. మధ్దెన పనేదన్నా తగిలి ఆగిందేమో? అన్నాడు మొత్తవెపుగా చూస్తూ.

''తాతా... అమ్మ ఇంత పొద్దుపోయిందాకా వుండకపోతే ఏం?'' అంది చేతనున్న పలకా పుస్తకాలు ఒకచోట పడేసి అలుగుతూ.

''అవమ్మా! ఇట్టా!'' అన్నాడు తాత సముదాయింపుగా.

దగ్గరకొచ్చింది ''ఏంటీ'' అంటూ.

పాపను ఒళ్లోకి తీసుకుని ''అమ్మా! నీకేదో పెద్ద పెద్ద సంగతులు, రాజుల కథలూ చెప్పాలనుంటుంది తల్లీ! కానీ ఏం చెప్పను?'' అని ఆగి ''ఇగో నీ అమ్మ మాత్రం ఇంకాసేపు నిలబడితే ఏ ధర్మ ప్రభువైనా ఓ పావలాకాసు విదిలిస్తాడని ఆబగా ఎదురుచూస్తానే వుంటుంది! అయినా ఒక్క నిన్ను చూసుకోవడం మినహా ఈడమాత్రం దానికున్న పనేంది? నేను అడుక్కుంది నాకే సరిపోతదిగదా! నేనెట్టాగు ముందస్తుగానే వస్తగదా! ఆ పిచ్చిదేమో అది కూస్త ఎనకా ముందటనా - నేనుంటననే ధైర్యంతో ఆగుతది'' అంటుండగానే చిట్టిదాని తల్లి గుడిసెలోకొచ్చింది.

''బిడ్డా వచ్చినవా? పసిది నీకోసం ఎదురు చూస్తున్నదే'' అన్నాడు తాత.

ఈ తాతకు ఇప్పటికీ ఈ బిడ్డపేరు తెలీదు. ఎక్కడి బిడ్డో తెలీదు. ఎందుకిట్టా వచ్చి తలదాచుకుంటుందోకూడా అడగలేదు. పురిటిపోరిని చంకనేసుకుని వచ్చింది. 'నీతాన వుంటా' అంది.

నవ్వినాడు.

''వీల్లేదా?'' అంది కళ్లనిండా నీరు నింపుకుని

''ఉండు'' అన్నాడు.

తలూపి కళ్లు తుడుచుకుని లోనకొచ్చింది.

ఒకనాడు ''నీ పేరేంది'' అని అడిగినాడు.

''బిడ్డా!'' అను చాలు అంది.

'చాలదా?' అన్నట్టు చూస్తూ అక్కర్లేదనుకున్నాడు.

అప్పటినుంచీ ఈ తాతకు బిడ్డ అది.

దాని బిడ్డ చిట్టి.

చిట్టికిప్పుడు ఆరేళ్లు. వీధి బడికి పంపుతున్నది.

బడికి అంపేనాడు చెప్పింది.

నవ్వినాడు.

ఆగింది.

''అది చదువుకుంటనన్నదా?'' అనడిగిండు.

## నో స్మోకింగ్



కేరళలో నూటికి నూరు శాతం అక్షరాస్యత సాధించిన గ్రామాలు ఎన్నో వున్నాయి. అలాగే ఈ మధ్య నూటికి నూరుశాతం పొగ త్రాగని గ్రామంకూడ ఆ రాష్ట్రంలో ఈ మధ్యనే ఉద్భవించింది! ఆ గ్రామం పేరు 'కూలీమాడ్'. కిందటి సంవత్సరం అక్టోబర్‌నుంచి ఆ గ్రామంలోని వారందరిచేత పొగ త్రాగడం మాన్పించిన ఘనత ఆ గ్రామ అక్షర గ్రంథాలయం, నెహ్రూ యువక కేంద్రాలకు దక్కుతుంది. పొగత్రాగడంవలన కలిగే నష్టాల్ని వారు గ్రామస్తులకు వివరంగా చెప్పడంతో అక్కడి యువకులంతా కలిసి, గ్రామంలోని షాపుల్లో ఉన్న సిగరెట్లు, బీడీలు, పొగాకులను సేకరించి తగలబెట్టడంతో ఈ ఉద్యమం ఊపందుకుంది. ఎవరైనా ఒకవేళ ఈ నిబంధనను అతిక్రమిస్తే వారిని గ్రామంనుంచి బహిష్కరించే స్థితిలో ఇప్పుడు ఆ గ్రామం వుంది. మరి ఆంధ్ర మహిళలూ... మీరు మళ్లీ ఇంకోసారి విజృంభించి మద్యపానాన్ని తరిమివేసినట్లే ధూమపానాన్నీ ఓ చూపు చూడండి!

- జూపిటర్

మాటాడలేదు.

అట్టాగే నిలబడింది.

''దానికో రికెందుకు కాదనాల'' అనిపించింది.

''బళ్లోకి పంపు'' అన్నాడు.

చిట్టిదానితో దండం పెట్టించి, తీస్కపోయి బళ్లో వేసింది.

గుడిసెలో కిర్సనాయిల దీపాన్ని ఎలిగించినట్టుంది.

కొద్దిగా ఎలుతురయింది.

గోనెపెట్ట అడుగున వున్న గుడ్డను దులిపింది.

చిల్లర కిందపడింది.

పోగుచేసి లెక్కపెట్టింది.

ఎనిమిది రూపాయల ముప్పై పైసలు.

చెల్లని పావలా ఒకటి తగిలింది. నాకంటే దరిద్రులు ఉన్నారు అని నవ్వుకుని దాన్ని పక్కన పెట్టి మిగిలినవాటిని భద్రంగా దాచి ముడేసి బిడ్డవైపు చూసి ''చదువుకోరాదూ'' అంది.

''చదువుకుంటాగానీ, ఆకలయితందే!'' అంది చిట్టి. ఏదైనా తెస్తే పెట్టు అన్నట్టుగా చూసి.

''నా తల్లే! ఇదిగో వండుతా రా నువ్వు పుస్తకం చదువుతూ కూర్చో! కూసేపటిలో అయిపోతాది అంది. బిడ్డకో లౌజు ముక్కయినా తేనందుకు తనను తాను తిట్టుకున్నది. గబగబా లేచి వంట ప్రయత్నంలో పడింది.

''బిడ్డా నువ్వు దాన్ని ఊళ్లేలిత్తావటే. చదువో చదువు అని దానెంట పడినావు. అదిప్పుడు వచ్చింది చదువునుంచే గదా! ప్రైవేటు పంతులు చదివించకుండా అక్కడ దీన్ని ఊర్కె కూచోబెడతాడా ఏంది?'' అన్నాడు తాత. చిట్టిని గారంగా చూస్తూ.

''నీకు తెలీదుగానీ - దాన్ని చదువుకోనీ... గారాబం చేయకు'' అంది కఠినంగా. గొట్టనుంచి ఆరిపోతున్న పొయ్యిని ఊదుతూ.

''ఓసి పిచ్చిమొఖమా! అసలు చదువు ఎవరికి కావాలో ? వాళ్లెందుకు చదువుతారో నీకేం తెలుసునే? చదువు అవసరం బాగా వున్నోళ్లకేనే ! గొప్పోళ్లకు! మనం చానా మందిరిమి చదివినా దాన్ని ఉపయోగించుకునేవాడు దొరికితేనే గదే ఉపయోగపడేది! మరి అట్ట ఉపయోగపెట్టుకునే అండదండలు మనకు లెవ్వుగదా! నానో సంగతి చెపుతా విను... ''అరుంధతీ దేవి'' అని సినిమాలలో వేషాలేసే పోరి ఒకతుంది తెల్సును? అది మన కులపుదే. మన కులంలో అంతకంటే అందగత్తెలు ఎందరు లేరు చెప్పు? పైగా దానికంటే వాచకం బాగా ఉన్నోళ్లూ డాన్సులు గట్రా చేసేటోళ్లూ వున్నారు. కాని ఏం లాభం అరుంధతిలా ఏ ఒక్కరూ కాలేకపోయినారు? ఎందుకంటావు?'' అని బిడ్డవేపు చూసి - దాని అక్కరున్నోడొకడు తగిలి దాన్నట్ట నిలబెట్టింది. ఆ కొమ్మను పట్టుకుని అదీ అట్టాగే నిలబడిపోయిందే. దాంతో మంచి పేరొచ్చింది. అప్పుడు అందరికీ అది కావాల్సొచ్చింది'' అంటుండగా-

''ఇగో! ఇట్టాటి ఊసుపోని పనికిరాని మాటలు దానికి చెప్పి... దాని చదువు చంకనాకి పోయేలా చేసేవు?'' అంది కోపంగా.

''బిడ్డా కోపమెందుకే. అయినా మనబోటోళ్లకు కోపం బొత్తిగా కుదరదు. అసలు పోం రావాలన్నా తెచ్చుకోవాలన్నా ఎనక ఎంత దన్ను వుండాలో తెలుసా? పేదోడి కోపం పెదవికి చేటు అని మనోళ్లు ఊర్కే అన్నారా?'' అని నవ్వి చేతగాని కోపం మననే కాల్చుకుతింటుంది! అమ్మీ నా మాట ఒక్కటిను! అక్కర తీరనోడికి బతుకు బారెడు అనిపిస్తది. ఎంత తిప్పలు పడ్డా కాలం తరగదు. బరువనిపిస్తది. అన్నీ మరినోడికి బతుకు చాలా చిన్నదిగా కనపడతది. పొద్దు ఎప్పుడు పొడుస్తదో ఎప్పుడు కూకుతదో కూడా తెల్సిచావదు. నాకు బతుకు తీరు తెల్సినంత


తెల్సినది! దాన్ని అట్టా వుంచు! పిల్లది పసిదికదా! దాన్ని ఆనందంగా బ్రతకనియ్యవెందుకే! ఈ దునియాలో పుట్టిన ఎవనికైనా లోకం తెలవడం మొదలయినప్పటినుంచి ఎట్టానూ కట్టాలు, కన్నీళ్లు తప్పవుగదా! బ్రతుకాట నడపాల్సిందేదుగా! సుఖపడే దానాలలో దాని సుఖాన్ని చెడగొట్టకు. సుకంపోయిన దినాలలో అది ఎంత గీపెట్టినా వచ్చేది కాదు! ఇగో చిట్టేది మొన్న దగ్గరకొచ్చి ఒళ్లో కూచుని తాతా చందమామను తాకగలవా? అనడిగిందే

''ఆ'' అని తలూపినా.

''అయితే నాకు తెచ్చిస్తావా?'' అంది గారాలుపోతూ.

''అమ్మలూ. ఇప్పుడు నాకు కాళ్ల కలకలు. మోపుగా ఇబ్బంది పెడుతున్నాయి. మందు వాడుతున్నాలే. తొందరగా నయమవుతాయి. ఆనక పోయి చందమామను తెచ్చిస్తాలే'' అన్నాను. ఇది జరిగేది కాదని నాకు తెలీదటే? తెల్సు! కానీ పసిది తెల్సీ తెలీక అడిగింది సరేనంటే నీ సోమ్మేం పోయింది. అమ్మీ నా మాట విన్నాక దానికి ఎంత సంబరమైందనీ? ఎలిగిపోయింది దాని మొఖం చందమామ లెక్కన.

''చందమామ కావాలా? ఇంకేమైనా కావద్దా. గొంతెమ్మ కోర్కెలు తీరవు. చచ్చాక తీరతాయి'' అని మనం అనొచ్చుకానీ దాని గుండె ఎంత విలవిలలాడిపోతుందో తెల్సునా? అందుకేనే. దాని మనసు నొప్పించక నువ్వు ఎన్నేళ్లు ఇట్టావున్నా దానికేమీ తెచ్చియ్యలేవు. ఒరగబెట్టలేవు. కనీసం దాని ఏ చిన్న కోరికా తీర్చలేవు. తెలియనితనంలో వున్నదాన్ని కనీసం కలలోనైనా ఆనందంగా బ్రతకనియ్యి. ఈ ఆనందం అనేది అనుకున్నప్పుడల్లా రాదే పిచ్చి మొఖమా! తోటి మనిషి అర్థమయినాక అది గల్లంతవుతుంది! ఆనక ఎంత ఎతికినా దొరికి చావదే!'' అని ఆగి ప్చ్! పసిదానికి చెప్పడమే కష్టమవుతదనుకుంటే... నీకసలు బొత్తిగా చెప్పేట్టే లేదుగదా! ఇగో! నాకిప్పుడెన్నేళ్లుంటాయనుకున్నావు? తొంభైకీ నూటికీ మధ్యన ఆ! తెల్సునా! నేను అరవై ఐదేళ్లనుంచి ఇట్టనే బతుకుతున్నా. నా పక్కనున్నోళ్ల కళ్లలో ఎన్నెన్ని ఆశలు చూసిన. ఎన్ని కలలు, ఎన్ని చందమామలు! అవేవీ వాళ్ల బతుకుల్లో నిజాలు కాలేదు. కానీ అమ్మీ... ఆ ఆశలతో వాళ్లు ఎంత



ఆనందంగా బతికినారో నాకు తెల్సు. మనకు పనికొచ్చే నిజాల్ని మనం చూడలేం. వాటిని తలచుకుంటేనే కళ్లు చెరువులవుతాయి. గుబులుతో గుండె తడి ఆరిపోతాది. కంటికి కునుకురాదు. పనికి నడుంకట్టనున్నా కాలు కదలదు'' అని ఆగలేదు. అమ్మవైపు చూశాడు. అమ్మ తనను వినిపించుకోవడంలేదని అర్థమైంది.

అయినా సణుగుకోసాగాడు లోలోన మెల్లగా.

గబగబా ఇంత ఉడకేసిందిలా వుంది. గబగబా లేచి గిన్నె కడిగి చిట్టికి ఇంత కలిపి పెట్టింది.

తాత దగ్గరకు ఇంత తెచ్చి ''ఇగో సణుగుడు ఆపి... ఇంత తిని పడుకో... నీకు ఇష్టమైన వేపుడు కారం ఏసినా. ఉడుకుడుకు అన్నం' అని. అతని మాటకు ఎదురు చూడకుండా వచ్చి తనింత పెట్టుకున్నది.

'తాత తిన్నాడో లేదో తెలియదుగానీ... తనలో తాను సణగడంమాత్రం ఆపలేదు.

''ఇక నువ్వు పడుకో'' అన్నది బిడ్డకు పక్క పర్చి.

చాలాసేపు వీపున జోకొట్టింది.

అయినా మెసలుతూనే వుంది పిల్లది.

లేచి భుజాన వేసుకుని ఆరుబయటకొచ్చింది.

గుడిసెలసంధ్యనుంచి చంద్రుడు చల్లంగా కనిపిస్తున్నాడు.

దూరంగా కాలవ గలలు వినిపిస్తున్నాయి.

గాలి విసురు కొద్దిగానే ఉన్నా హాయిగా అనిపించింది. పిల్లను భుజానేసుకుని అటూ ఇటూ నాల్గుసార్లు తిరిగింది.

జోకొడుతూ దాన్ని నిద్ర పుచ్చుతుంటే 'అమ్మ'కి ఆవిడ అమ్మ గుర్తుకొచ్చింది.

గుండె కదలినట్టు పేగు కలుక్కుమన్నట్టుగా అనిపించింది.

కళ్లు చెమర్చినాయి.

ఆలస్యం లేకుండానే కన్నీరుబికి చెంపలమీదకు జారింది. తుడుచుకోవాలనికూడా అనిపించలేదు.

పెదాలకు తగిలినయ్. వెచ్చగా - ఉప్పగా.

''అమ్మ!''

''తన కన్నతల్లి?''

''అమ్మా!'' అని పెద్దగా అరిచి పిలవాలనిపించింది.

అమ్మను చేరుకోవాలనీ. ఆమె ఒడిని ముడుచుకుని ఆదమరచి నిద్రపోవాలనీ, లేచీ లేవగానే అమ్మ ఒడినుండే బయటకు రావాలనీ అనిపించింది.

మనసంతా పిండినట్లయింది!

'అమ్మ!'

ఎంత మంచి అమ్మ!

కానీ -

తప్పతాగి అర్ధరాత్రి దాటాక తలుపులు తన్నుతూ చేతికి దొరికిన వస్తువులను విసురుతూ గడపదాటి అడుగుపెట్టి అదెందుకు లేదు? ఇది కావాలని తెలీదా? ఏం చేస్తున్నావింతసేపు? అని ఏదో ఒక వంకపెట్టి దొంగగొడ్డును కట్టేసి బాదినట్టు జుత్తు చేతజిక్కించుకుని గుంజనుండి కొడుతూ ఎగిరెగిరి తంతుంటే - ఉలిక్కిపడి లేచి - కనిపిస్తున్న రాక్షసపు స్థితిని చూసి అమ్మకు అడ్డం నిలబడలేక తండ్రి అన్నవానికి ఎదురెత్తలేక అమ్మా! అమ్మా! అని గుండె అవిసిపోయేలా ఏడ్చేది. నా ఏడుపును సహించలేక -

నన్ను కన్నతండ్రి -

ఒక్కసారి ఎత్తి నన్ను అమాంతం వరండాలోకి విసిరేశాడు.

అమ్మ అడ్డుపడలేకపోయింది. నేను స్పృహ తప్పాను.

కళ్లు తెరిచేసరికి చల్లటి అమ్మ వడిన వున్నాను.

నా వీపును చేత్తో నిమురుతోంది.

కాలుతో అప్పుడప్పుడూ ఊపుతోంది.

ఆమేమో శోకదేవతలా అనిపించింది. వెచ్చటి కన్నీరు. నా పైన పడుతోంది.

ఉలిక్కిపడి లేచి అమ్మా అమ్మా అంటూ అమ్మ ఒళ్లంతా తడిమి చూశాను.

వళ్లంతా కదుములు

గాయాలు.

చిన్న చిన్న రక్తపు మరకలు.

అమ్మా అని భయంగా అరిచి ఒడిలో తల దాచుకుని ఏడ్చాను.

'ఏంటే పిచ్చి మొఖమా! భయమెందుకూ! ఏం లేదులే' అంది సముదాయిస్తూ. అయినా అమ్మను పూర్తిగా చూడాలంటే జంకు అనిపించిందిం.

కానీ చూడక వుండగలనా!

అమ్మ! మా అమ్మ!

అమ్మో చూడక బ్రతకగలనా! ఉహూ!

ఎంతటి కఠోరమైన బాధలలోకూడా -

అమ్మ ఆప్యాయత - ఆత్మీయత - అతులేని మమకారం నన్ను చుట్టి నాకు రక్షణ కవచంలాగా వుండేది.

కంటికి రెప్పలా కాపాడేది.

కళ్లలో ఎప్పుడూ నన్నే నిలుపుకునేది.

''అమ్మలూ! ఒకసారిట్లా! అని చేతులు చాపి దగ్గరకు తీసుకుని గుండెలకు హత్తుకుని మైమరచేది.

అలాంటి అమృతమయి అమ్మను ఆ వేళ...

తండ్రి అన్న త్రాష్టుడు త్రాగిన మైకంలో చేతికందిన కట్టెతో కసిగా కొడితే అది నెనురకణతకి తగిలి అమ్మా నా అమ్మ నా సర్వస్వం కుప్పకూలిపోయింది.

అయినా 'చావు నంజ' అనుకుంటూ చేసిన దానికి రొప్పుకుంటూ తలుపులు బార్లా తెరిచి గడపదాటి పోయాడు.

ఆ క్షణానే అమ్మ ఊపిరి వదిలింది.

ఇక్కడ నరకాన్ని వదిలించుకుని వెళ్లిపోయింది.

ఎక్కడికో! ఏమో!

నేను అక్కడే ఏడ్చి ఏడ్చి సొమ్మసిల్లాను. నన్ను ప్రక్కన పెట్టి అమ్మను తీసుకెళ్లారు.

ఆ అమ్మకోసం నేను ఎన్నిరోజులు నిద్రాహారాలు మాని ఏడ్చానో?

అయితే... నా కంటితడి ఆరకముందే...

మరో అమ్మ మా గడపలోకొచ్చింది.

నాకు విచిత్రమనిపించింది.

## ప్రాణం

''నా కంఠంలో ప్రాణముండగా నా కూతుర్ని నీకివ్వను!'' కోపంగా అరిచాడు రాఘవరావు!

''ప్రాణం కంఠంలో వుండదుసార్. గుండెలో వుంటుంది...!'' తాపీగా చెప్పాడు కిషోర్.

- ముత్యాలశ్రీ శరత్‌బాబు (కొమరగిరిపట్నం)



నాన్న ఏమిటో తెల్సినాకకూడా ఆడపిల్లల్ని - కటికివానికి పట్టిచ్చినట్టు తోలుతున్నారెందుకు?

ఇది నాకు అర్థం కాలేదు.

అయితే నెల తిరక్కుండానే ఈవిడ చెంపా పేలిపోయింది. నోరు మెదపబోతే డొక్కలో లాగి తన్నాడు. తగిలిన దెబ్బకు విలవిలలాడిపోతుంటే జుత్తు పట్టుకుని బరబరా ఈడ్చుకుని పోయి పెరటిన ఉన్న మంచంపైన పడేశాడు.

రెండో నెల తిరక్కుండానే ఈ అమ్మ పారిపోయింది.

వెతికినా జాడ తెలీలేదు.

మళ్లీ మరో అమ్మ.

ఏడాది పూర్తయ్యేసరికి నలుగురు అమ్మలు వచ్చారు. శపిస్తూ పారిపోయారు.

అప్పుడనిపించింది.

మా అమ్మ భరించిన కష్టం ఎంతో!

అది ఎన్ని సముద్రాలంతదో!

ఇంత జరిగినా -

ఎప్పుడూ నాన్నను తప్పు పట్టినట్టుగా అనిపించలేదు.

కారణం అర్థమూ కాలేదు.

పైగా -

మగవాడు ఎట్టా వుంటేం!

ఇంటికాడ ఉన్నది అన్నింటినీ చక్కపెట్టుకోవాల. మగాణ్ణి దోవకు తెచ్చుకోవాలి అనడం అనేకసార్లు విన్నాను.

మగా ఆడలలో ఒక్క మగవాడే మనిషా?

అట్టా ఏ భ్రష్టపు దేవుడన్నా సర్టిఫికేటుగాని ఇచ్చిపంపాడా?

'మగాడి'గా పుడితే ఏ తప్పైనా చేయొచ్చా?

అలాటి వెపన్స్ ఏడైనా పొందారా?

ఎందరాడాళ్లనైనా పెళ్లాడవచ్చా?

'నాన్న'లా ఎన్ని చిత్రహింసలనైనా పెట్టొచ్చా?

ఎందరినైనా చంపి కొత్త పెళ్లాన్ని వెతుక్కోవచ్చా?

అసలు 'మగాడు' అంటే ఏమిటి?

ఈ భ్రష్టుడికి ఇలాంటి పాశవిక శక్తిని దారాదత్తం చేసిం

అసలు చి ఈ ఆడ, మగ - ఇదేమిటి?

తల పగిలిపోయే స్థితి

బొత్తిగా అర్థంకాలేదు.

ఒక్కోసారి మాత్రం మగాడు ఓ అర్థంకాని జంతువు అనిపించేది.

శరీరంలో శక్తి వుండికూడా.

ఏ అమ్మా - నాన్నకు ఎదురు తిరగలేదు.

పైగా వానికేమైనా అయితే ప్రాణం అలిసిపోయేలా పరుగెత్తేవారు.

ఆయన మాత్రం విచిత్రమైన పశువులా నిత్యం ప్రవర్తించేవాడు. ఆడాళ్లంతా ఆయన చేతిలో బేలగా తన్నులు తినడం -

మూలిగలు పుచ్చిపోయేలా విరగ్గొట్టి - ఆ కన్నీరూ ఏడుపూ ఆగక మునుపే -

మంచమెక్కమంటే కిక్కురుమనకుండా ఎక్కేవారు.

దిగిపొమ్మంటే చాపమీదికొచ్చేవారు.

ఇదీ అర్థంకాలేదు.

అయితే ఆ తరువాత నాన్న కొత్త అమ్మలను తేలేకపోయాడు.

కాలగమనం చిత్రమైంది.

ప్రళయాలకు చలించారు.

ప్రశాంతతనూ భరించారు.

తానుగా తృప్తిపడరు.

గమనాన్ని ఆపరు. నిబద్ధతను వదలరు. ఏ ఆటుపోటులకూ చలించని చిత్రమైన నిశ్చలత దాని స్వభావమేమో.

నాకూ వయసొచ్చిందని.

వంటి కాంతి పెరిగింది.

అందమైన మగవాడు కనపడినప్పుడు చూడబుద్దేస్తుంది.

కానీ నాన్న గుర్తుకొచ్చి అసలు మగాడితో పెళ్లేంటి? అనిపించేది.

అయితే నన్ను రామనాథం అనేవాడు ఒకనాడు పిలిచాడు.

ఆగాను.

నిన్ను చాలాకాలంగా ప్రేమిస్తున్నాను. నువ్వు లేకపోతే బ్రతకలేననీ పెద్దల సమక్షంలో పెళ్లాడతాననీ, నన్ను సుఖపెట్టడానికి అతని దగ్గర ఫలానా ఒనరులున్నాయనీ చెప్పాడు.

''తన్నులు తినేందుకు - చంపిందాకా బానిసలా వుండి చచ్చేందుకూ పెళ్లి'' అనాలనిపించింది. భయంకూడా వేసింది.

నేనుమాటాడలేకపోయాను.

చకచకా ఇంటికొచ్చాను.

నాన్న అనే కిరాతకుడు బ్రతికే వున్నాడుగదా!

పెళ్లి చేసుకోవాలి అన్నాడు.

ఇక ఆగేదేముంది?

నా పరిస్థితి చెప్పేటందుకు అమ్మలేదుగదా! ఎప్పుడో పొట్టన పెట్టుకున్నాడాయెం! చాలా భయంగా కాపురానికెళ్ళాను.

'మగడంటే ఇలా వుంటాడా?'

నాన్నలా కాదన్నమాట అనిపించాడు రామనాథం కొత్తలో.

పూవులా చూసుకున్నాడు.

రోజూ పూలు తెచ్చేవాడు.

వేళపట్టున ఇంటికి చేరేవాడు. నాకు నెలతప్పింది.

ఆరోజు అతని కౌగిలిలో అదుపుతప్పి తలమునకలై సొక్కిసోలిన తరుణాన రామనాథం చెవిలో గుసగుసగా చెప్పాను.

అంటే

ఎలాగో అయ్యాడు.

''ఇప్పుడేం కడుపు?'' అన్నాడు చిరాకుగా.

ఉలిక్కిపడి లేచి కూర్చుని ''ఏం చేయను?'' అన్నాను.

''తీసేసుకో'' అన్నాడు.

కాలిలో విరిగిన ముల్లును 'చిమ్మెటతో పీకెయ్' అన్నట్టు.

# పనిదొంగలు లేని దేశం



ప్రపంచంలో ఏ దేశంలోని ప్రజలు ఎక్కువకాలం బ్రతుకుతారో తెల్సా? జపాన్ దేశానికి చెందినవారు! ఆ దేశానికి చెందిన పురుషుల సగటు వయసు 76 సంవత్సరాలైతే... స్త్రీల సగటు వయసు 82 సంవత్సరాలు! వారు అంత ఎక్కువ కాలం బ్రతకగలగడానికి కారణం... వారి జీవిత సరళే! కష్టపడి పనిచేయడమే వారి ఆరోగ్య రహస్యం! జపాన్‌లో పనిదొంగలు చాలా తక్కువమంది వుంటారట! అందుకే జపాన్ అభివృద్ధిచెందిన దేశంగా గుర్తించబడింది!

- జూపిటర్

నా ఒళ్లు అరక్షణంలో బిగుసుకుపోయింది.

''నాకు తెలీదు'' అన్నాను.

''నే చెప్తాను'' అన్నాడు.

''ఈసారికి ఉంచుకుందాం'' అన్నాను.

''నాకిష్టం లేదన్నానుగదా!'' అన్నాడు క్రూరంగా

''నాన్నలో ఉన్న మగవెధవ' ఇక్కడా అప్పుడు స్పష్టంగా కనిపించాడు.

అలా.... నాల్గుసార్లు.

ఆర్పిన సిగరెట్టును గిరాటేసినట్టుగా...

నిర్దాక్షిణ్యంగా... భ్రూణహత్యకు పాల్పడాల్సి వచ్చింది.

అలా తీసేయించుకున్న రోజునే తాగివచ్చి మంచమెక్కమన్నాడు.

ఆ బాధ భరించడం నా వల్ల కాదనిపించింది.

''నాకు ఆపరేషన్ చేయించండి'' అన్నాను.

అంటే నన్ను తోడేలులా చూశాడు.

వాడి చూపులో నామీద అనుమానం స్ఫురించింది.

అనుకున్నట్టుగానే అయింది.

''పారిపోయి కొత్త మొగుణ్ని వెతుక్కుందామనుకుంటున్నావా?'' అన్నాడొకనాడు.

అలా ఎందుకనుకున్నాడో, అన్నాడో అర్ధమై చావలేదు.

బిత్తరపోయి చూశాను. ఇదేం నింద మరి.

అది మొదలు నన్ను శారీరకంగా బాధించడం ప్రారంభించాడు.

మళ్లీ నెలతప్పింది.

అయితే ఈ మాట చెప్పేందుకు కూడా ఈసారి ధైర్యం చాలలేదు. నెలలొస్తున్నాయి.

ఆయనకు తెలియనివ్వాలనిపించలేదు.

ఆరోజు రాత్రి రామనాథం ఊరికిపోయింది చూసి బయటపడ్డాను. రామనాథం వచ్చాక వెదుకుతాడు అని నాకు తెలుసు. అతనికి కనబడకుండా వుండాలి.

చాలా దూరం వెళ్లాను. దిక్కులేక, తోచక ఓ బిక్షగాడింట తలదాచుకున్నాను. అతగానికి నా జాడ తెలీకూడదుగదా! అందుకే నా ఎడమ చెయ్యి వంకరయింది.

ఓ కన్ను పోగొట్టుకోవాల్సి వచ్చింది.

ఇలా దయనీయంగా కనిపిస్తేనే ఈ దేశానికి ఉన్న ధర్మ ప్రభువులకు జాలి అనిపించి పైసలువేస్తారట.

ఏది ఏమైతేనేం కన్నదాకా ఓపిక పట్టాను.

ఆడపిల్ల పుట్టింది.

విసిరి పారేయాలనిపించింది. దాన్ని పెంచీ మగాళ్లకు అప్పగించడమేగదా! ఇప్పుడే చంపితే ఏ బాధా వుండదు అనిపించి చంపబోయాను. చేతులు రాలేదు.

అంతుమాలిన జాలి.

చంపబోయి గుండెలకు హత్తుకున్నాను.

ఆ రోజల్లా అక్కడే కూర్చుని ఏడ్చాను. ఆడదాని ఈ బలహీనతే మగ ప్రపంచానికి కట్టు బానిసను చేసిందేమో? ఆ రాత్రి గుడిసెను చేరాను. భిక్షగాడు ఈ పసిదాన్నీ అనుదుక్కునేందుకు అనువుగా కన్ను, కాలు తీసేస్తాడేమో? అనిపించి గుండె వణికింది.

అక్కడినుండి బిడ్డను చంకనేసుకుని పారిపోయి ఈ తాతను చేరింది.

అప్పటినుంచీ ఈ తాతే మగాడైనా దేవుడిలా ఆసరా ఇచ్చాడు. కవచంలా కాపాడుతూ వచ్చాడు.

అమ్మో! భుజాన చిట్టి నిదరోయింది. దాన్ని భుజానేసుకుని కలలుకంటే ఎట్టనే అని నవ్వి అమ్మీ. ఇక పిల్లదాన్ని జోకొట్టకు నిద్రపోయేవరకేనే అది.

నిద్రలో వుండగా జోకొడితే మెళుకువ వస్తది. పిల్లది లేస్తది'' అన్నాడు.

''అట్టాగే'' అని నువ్వింకా నిద్రపోలేదా తాతా... కళ్లు మండుతున్నాయంటివిగదా!'' అంటూ పిల్లకు చాప చింకిపై పడుకోబెట్టి, గుడ్డ కప్పి దానిపై చేయేసి పక్కనే ముడుచుకుంది. తిరిగి వెనక్కి కలలోకి నడవలేదు.

నిద్ర ముంచుకొచ్చింది. ఆ పూటకు కన్నీరాడిసిపోయిందిగనుక గుండె తేలికయింది.

★ ★ ★

ఈ దేశాన మనిషి మనుగడ సాగిస్తున్న ప్రతీచోటా - ఇట్లాంటి బ్రతుకులెన్నో?

ఎన్నెన్నో?

వీటికి ఆదరువు దొరికేనా?

గుండెనిండా గాలి పీల్చుకుని, బ్రతికే కాలమొచ్చేనా?

ఏ ఆదర్శమూ, అనుసరణా ఆదరణా వారిని చేరగలవా?

వారి కంటి వెలుగు చూసే కాలం రావాలనీ - జనారణ్యంకాని జీవన క్రమం - మానవాళిని పులకింపజేయాలనీ, కోరుకుంటూ-

★ ★ ★

